క్లుప్తంగా

సుధాకర్‌రావు సేవలు ఎనలేనివి



టీచర్ సుధాకరరావును సన్మానిస్తున్న గ్రామస్తులు

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్య పల్లె పంచాయతీ వేణుగోపాలపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన సుధాకర్ రావును గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మంగళవారం పాఠశాలలో సన్మాన సభ ఏర్పాటు చేసి పూలమాల వేసి దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగరత్నం మాట్లాడుతూ విద్యార్థులను అన్నివిధాలా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుడు సుధాకరరావు సేవలు అమోఘమన్నారు. పేద విద్యార్థులకు అండగా నిలుస్తూ విద్యతో పాటు జ్ఞానాన్ని అందించడంలో ఆయన ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అయ్యప్పరెడ్డి, స్థానిక నాయకులు బీఎం రవి, మురగయ్య, భాస్కర్, కాంతమ్మ, నేతాజీ పాల్గొన్నారు.

సింహ వాహనంపై పరాశరేశ్వరుడు



చంద్రప్రభ వాహనంపై పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపక వల్లీ సమేత పరాశరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో మంగళవారం సాయంత్రం సింహ వాహనాన్ని ఉత్సవమూర్తులు అధిరోహించి భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలు, పరివార దేవతలకు అభిషేకాలను నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వరునికి స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలను అందుకున్న ఉత్సవమూర్తులు సింహవాహనాన్ని అధిరోహించారు. సర్కారు హారతి అందుకున్న దేవేరులు గ్రామోత్సవంలో భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్, జమేదార్ రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్: చోరీ కేసులో తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా జ్యోతినగర్ కాలనీకి చెందిన మేకల వంశీధర్‌రెడ్డికి ఏడాది జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం తీర్పు చెప్పారు. 2022 జూన్ 11వ తేదీ తిరుపతి గోపాలరాజు కాలనీలోని ఓ ఇంటి తలుపులు పగులగొట్టి పూజ గదిలో ఉన్న రూ.1800 నాణేలను వంశీధర్‌రెడ్డి అపహరించాడు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణ దశలో నిందితుడు నేరం అంగీకరించడంతో న్యాయమూర్తి అతనికి శిక్ష విధించారు.

విద్యాహక్కు చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

చిత్తూరు కలెక్టరేట్ : స్థానిక పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో 8, 9 తరగతుల విద్యార్థులకు విద్యాహక్కు చట్టంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్.. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకునేందుకు పలు ప్రశ్నలను సంధించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ, పాఠశాల అంటే కులమతాలకు అతీతంగా, బాలబాలికలకు సమానంగా చూసే ప్రదేశాన్ని పాఠశాల అంటారని నిర్వచించారు. అంతకుముందు పాఠశాల అంటే ఏమిటని విద్యార్థులను ఆయన ప్రశ్నించి వారికి పాఠశాల అంటే ఏ భావనతో ఉన్నారో తెలుసుకున్నారు. విద్యార్థి దశ నుంచే హక్కులను, చట్టాలను తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వాలు విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తెరిగి, సదుపాయాలను సద్వినియోగం చేసుకుని అన్నింటా రాణించాలని మార్గదర్శనం చేశారు. డీఈవో విజయేంద్రరావు మాట్లాడుతూ డ్రాపౌట్స్‌ను తిరిగి స్కూళ్లలో చేర్పించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఓంకార్‌రావు మాట్లాడుతూ, 18 ఏళ్లలోపు వారిని పనిలో పెట్టుకుంటే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. చదువుకోవాల్సిన పిల్లలు ఎక్కడైనా పనిచేస్తుంటే 1902కు సమాచారం ఇవ్వాలని కోరా రు. సమావేశంలో ఎంఈఓ-1 సెల్వరాజ్, ఎంఈఓ-2 మోహన్, సమగ్రశిక్ష శాఖ సెక్టోరల్ అధికారి అజయ్‌కుమార్‌రెడ్డి, హెచ్‌ఎం పూర్ణిమ, పీడీ కోమల, సీడీపీవో నిర్మల తదితరులు పాల్గొన్నారు.

1980లో శిథిలావస్థలో ఉన్న బుగ్గ ఆలయం, 1989లో జరిగిన కుంభాభిషేకంలో పాల్గొన్న భక్తులు, ప్రస్తుతం బుగ్గ దేవాలయం







దివ్యధామం.. బుగ్గక్షేత్రం..

- దక్షిణ కాశీగా పిలవబడుతున్న క్షేత్రం
- తాజాగా కల్యాణ మండపానికి రూ.2 కోట్లు కేటాయించిన టీటీడీ
- మంత్రి ఆర్‌కే రోజా ప్రత్యేక చొరవ
- పాలక మండలి సమావేశంలో నిర్ణయించిన టీటీడీ



ఆలయం వద్ద జలధార



టీటీడీ వారు ప్రహరీని పటిష్ట పరచి ఏర్పాటు చేసిన రక్షణ గ్రిల్స్

నగరి : మండలంలోని బుగ్గ అగ్రహారం గ్రామంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. ఇందులో భాగంగా మంత్రి ఆర్‌కే రోజా చొరవతో కల్యాణ మండపం నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరైంది. సోమవారం జరిగిన టీటీడీ పాలక మండలి సమావేశంలో కల్యాణ మండపం నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించినట్లు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డి వెల్లడించారు. దీంతో ఆలయ ఆవరణలో టీటీడీ కల్యాణ మండప నిర్మాణం జరగనుంది. కల్యాణమండపం నిర్మించడం ద్వారా పేద ప్రజలు తక్కువ వ్యయంతో పెళ్లిళ్లు జరిపేందుకే అవకాశం లభిస్తుంది. చారిత్రక ప్రసిద్ధి పొందిన ఆలయ ప్రాముఖ్యత పెరగడంతో పాటు భక్తుల సంఖ్య కూడా పెరుగుతుంది. దీనిపై స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న ఆలయ చరిత్ర, ప్రత్యేకతను ఒకమారు పరిశీలిస్తే..

ఆలయ చరిత్ర..

దేశసంచారం చేస్తూ ప్రశాంత వాతావరణం కలిగిన ఈ ప్రదేశంలో గౌతమి మహర్షి సేదతీరారు. గంగానది ఒడ్డున్న ఉన్న కాశీ ఆలయం వద్ద గల ప్రశాంతతను ఇక్కడి కుశస్థలీ నది ఒడ్డున ఉన్నట్లు ఆయనకు తోచడంతో, ఉత్తర భాగంలో ఓ కాశీ ఉండగా దక్షిణ భాగంలోనూ ఒక కాశీ ఉండాలని నిశ్చయించుకున్న ఆయన మరో కాశీని ఇక్కడ సృష్టించారని చరిత్ర చెబుతోంది. ప్రధాన ఆలయ గోడలపై ఉన్న శిల్పాలు చరిత్రకు ఆధారాలుగా నిలుస్తోంది. వనవాస సమయంలో ఈ ప్రాంతంలో సంచరించిన పాండవుల కాశీని పోలిన విధంగా ఇక్కడ దేవతా విగ్రహాలు ఉండడాన్ని గమనించారు. ఈ ఆలయంలో గంగాజలం కొరత ఉన్నట్లు భావించిన వారు కౌశి, గుహ, భవానీ, మణికర్ణిక, యమున అనే ఐదు జలధారలను సృష్టించారు. ఆలయ మహత్యాన్ని తెలుసుకున్న చోళరాజులు ఇక్కడ ఆలయాన్ని నిర్మించారు.

ఆలయ ప్రత్యేకత..

వారణాశి (కాశీ) ఆలయాన్ని పోలిన విధంగా ఈ ఆలయంలో సకలదేవతలు కొలువై ఉంటారు. విశ్వేశ్వరుడు, కామాక్షిదేవి, అన్నపూర్ణదేవి, భూనీలాదేవిసమేత ప్రయాగ మాధవస్వామి, కాలభైరవ స్వామి, దొంటి గణపతి, సద్యోజాతమూర్తి, వావుదేవమూర్తి, అఘోరమూర్తి, వల్లీ దేవయాని సమేత సుబ్రమణ్య స్వామి, భక్తకన్నప్ప, దుర్గాదేవి, తత్పురుష మూర్తి, వీరభద్ర స్వామి, మహిషాసుర మర్ధిని, సూర్యనారాయణ స్వామి, భక్తాంజనేయ స్వామి విగ్రహాలు ఉన్నాయి. అందుకే దీన్ని దక్షిణ కాశీ అని, బుగ్గదేవాలయం అని, శ్రీబుగ్గ అని, గౌతమ బుగ్గక్షేత్రం అని పిలుస్తారు.

ఆలయ అభివృద్ధి ఇలా..

చోళరాజుల పాలనలో నిర్మించిన ఈ ఆలయాన్ని కార్వేటినగరం రాజులు అనంతరం తిరుపతి మహంతులు ఆలయాన్ని పర్యవేక్షిస్తూ వచ్చారు. వారి అనంతరం ఆలయం శిథిలావస్థకు లోనుకాగా 1987లో పళ్లిపట్టుకు చెందిన ఇండియన్ ఆయిల్ డీలర్ శ్రీనివాసులు రెడ్డి పునరుద్ధరించారు. 1989లో కంచి శంకరమఠం వారు ఆలయాన్ని నవీనీకరించి కుంభాభిషేకం చేశారు. 1994వ సంవత్సరం అక్టోబరు 7వ తేదీన తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయాన్ని విలీనం చేసుకుంది. అప్పటి నుంచి ధూపదీప నైవేద్యాలతో పాటు పర్వదినాల్లో ప్రత్యేకపూజలు జరుగుతూ ఆలయం పూర్వవైభవం సంతరించుకుంది. టీటీడీ అనుమతితో 2013వ సంవత్సరం కంచి పీఠాధిపతులు జయేంద్ర సరస్వతి, విజయేంద్ర సరస్వతి హాజరై కుంభాభిషేకం నిర్వహించారు. అభివృద్ధిలో భాగంగా ఆలయ ప్రహరీని బలపరచడంతో పాటు గోడలపై రక్షణ గ్రిల్స్ అమర్చారు. ప్రతి సోమవారం దాతల ద్వారా అన్నదానం చేసే ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం ఆలయ ఆవరణలో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరైంది.

మంత్రి సహకారం మరువలేనిది..



ఆలయం వద్ద టీటీడీ కల్యాణ మండపం నిర్మిస్తే పలువురికి సాయంగా ఉంటుందన్న కోరికను మంత్రి వద్ద ఉంచగానే ఆమె వెంటనే స్పందించారు. ఈ విషయమై టీటీడీ అధికారులను సంప్రదించారు. పలు సందర్భాల్లో ఈ అంశాన్ని వారి దృష్టికి తెచ్చారు. దీంతో నేడు కల్యాణ మండపం నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరైంది. ఈ సహకారం మరువలేనిది. గ్రామస్తులు ఆమెకు రుణపడి ఉంటారు.

– రవికుమార్, సర్పంచ్, బుగ్గ అగ్రహారం

శ్రీవాణి ట్రస్ట్‌పై కుట్రపూరిత ఆరోపణలు

- టీటీడీ గోసంరక్షణ ట్రస్ట్ సభ్యుడు రామ్‌సునీల్ రెడ్డి



తిరుపతి రూరల్: టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులపై చంద్రబాబు నాయుడు, ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ రాజకీయ ప్రయోజనాల కోసం కుట్ర పూరిత ఆరోపణలు చేస్తున్నారని టీటీడీ గోసంరక్షణ ట్రస్ట్ సభ్యుడు రామ్ సునీల్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని రాజకీయ వివాదం చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఇద్దరూ కుట్ర చేశారని ఆరోపించారు. ఈ కుట్రలో భాగంగానే మొదట దత్త పుత్రుడు, ఆ తరువాత దత్త తండ్రి శ్రీవాణి ట్రస్ట్‌పై ఆరోపణలు చేశారన్నారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి నేతృత్వంలో సాధారణ భక్తులకు పెద్ద పీట వేస్తున్నారని చెప్పారు. శ్రీవాణి ట్రస్టుకు రూ.10 వేలు విరాళం, దర్శనం టిక్కెట్‌కు రూ.500 చెల్లించిన ప్రతి భక్తుడికీ రెండు రసీదులు ఇస్తున్నారని తెలిపారు. టీటీడీ పాలన మొత్తం పారదర్శకంగా జరుగుతుండడం ఆ ఇద్దరికీ మింగుడుపడటం లేదన్నారు. అందుకే పదే పదే చౌకబారు ఆరోపణలు చేస్తున్నారన్నారు. 2019లో శ్రీవాణి ట్రస్టు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.690 కోట్ల నిధులు అందినట్లు చెప్పారు. ఆరోపణలు చేస్తున్న వారు ఎప్పుడైనా వచ్చి లెక్కలు చూసుకోవచ్చని చైర్మన్ సుబ్బారెడ్డి సవాల్ విసిరిన విషయాన్ని గుర్తు చేశారు. శ్రీవాణి నిధులతో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో 2445 ఆలయాలు నిర్మిస్తున్న విషయాన్ని దత్త పుత్రుడు, దత్త తండ్రి గుర్తించాలని హితవుపలికారు. మరోసారి ఇలాంటి విద్వేషపూరిత ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

పాఠశాలకు స్టౌ, చైర్లు వితరణ



స్టౌ, చైర్లు వితరణగా అందిస్తున్న సర్పంచ్ ప్రకాష్

నగరి : మండలంలోని ముడిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు సర్పంచ్ ప్రకాష్ మంగళవారం రూ.15 వేలు విలువ కలిగిన స్టౌ, ప్లాస్టిక్ చైర్లను వితరణగా అందించారు. ఎంఈఓ శ్రీదేవి సమక్షంలో ఆయన వస్తువులను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ పాఠశాల అభివృద్ధికి దాతలు ఎంతో సహకారం అందిస్తున్నారని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సులోచనమ్మ, ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ అయ్యప్ప, నాయకులు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

- అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం
- సచివాయల ఉద్యోగులు బాధ్యతగా పని చేయండి
- జిల్లా కలెక్టర్ షణ్మోహన్



పాలసముద్రంలో జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్



టీవీఎన్ఆర్ పురం గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్

పాలసముద్రం : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామ సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చిందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా నరసింహపురం గ్రామ సచివాలయం, తిరుమలరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులు, పాలసముద్రం జగనన్న లేఅవుట్, పీహెచ్‌సీని పరిశీలించారు. నరసింహపురం గ్రామ సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి సమస్యలతో వచ్చిన వారితో స్నేహభావంతో మెలిగి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. అప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని తెలిపారు. వలంటీర్లు వారికి కేటాయించిన కుటుంబాలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ఇళ్ల వద్దే అందించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, అప్పుడే సంబంధిత అధికారులు స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. సచివాలయ వ్యవస్థను బలోపేతం చేయడానికి అందరూ కృషి చేయాలని, తిరుమలరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నాడు-నేడు పనులు పూర్తి కాకపోవడంతో విద్యాశాఖ అధికారిపై అసహనం వ్యక్తం చేశారు. అలాగే ఎస్ఎస్ఏ ఏఈ మునిరత్నం నాడు-నేడు పనులను పర్యవేక్షించడం లేదన్న కారణంతో ఆయనను విధుల నుంచి తొలగించారు. పాలసముద్రం జగనన్న లేఅవుట్‌లో ఇంకా గృహనిర్మాణ పనులు ప్రారంభించని వారికి నోటీసులు పంపించి, వాటిని రద్దు చేసి మరొకరికి అవకాశం ఇవ్వాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి అనంతరం ఫొటో తనకు పెట్టాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఎంతమంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సీజన్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారా ? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ ప్రేమ్ రాజ్ కుమార్, హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ గోవిందరాజు, సర్పంచ్ అయ్యప్ప, హౌసింగ్ ఏఈ దాము, తదితరులు పాల్గొన్నారు.

టీవీఎన్ఆర్ పురంలో పర్యటన

పాలసముద్రం : మండలంలోని తిరువెంగళనాథ రాజుపురం గ్రామాన్ని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సందర్శించారు. గత వారం రోజుల కిందట గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి టీవీఎన్ఆర్ పురం పర్యటించినప్పుడు గ్రామస్తులు పలు సమస్యలు విన్నవించారు. అందులో ఈ కాలువ పొరంబోకు భూమి సమస్యను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయన జిల్లా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా గ్రామస్తుల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ గ్రామానికి స్థానిక తహసీల్దార్ బాబు, సర్వేయర్లతో కలిసి విచ్చేశారు. కాలువ పొరంబోకు మ్యాప్‌ను పరిశీలించి, అక్కడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దీనిపై గ్రామస్తులు మాట్లాడుతూ తాము గత కొన్నేళ్లుగా బోర్లు వేసుకుని చెరుకు, వరి, వేరుశనగ, తదితర పంటలు సాగు చేస్తున్నామని, కానీ తమకు పట్టాలు లేవని జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు విన్నవించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ గ్రామస్తులంతా కలసి మాట్లాడి ఒక నిర్ణయం తీసుకుని తన వద్దకు రావాలని, అప్పుడు సమస్యను పరిష్కరిస్తామన్నారు. దీంతో గ్రామస్తులు ఆనందంతో కలెక్టర్‌కు మంగళ హారతులు ఇచ్చి సన్మానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, రెవెన్యూ సిబ్బంది, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఎంపీటీసీ జనార్ధరాజు, రమేష్, సుబ్రమణ్యరాజు, మునిరత్నరాజు, లక్ష్మీపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’ అమలుపై శిక్షణ



మాట్లాడుతున్న కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి



హాజరైన వలంటీర్లు, సచివాలయ సిబ్బంది

పుత్తూరు రూరల్: జగనన్న సురక్ష పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సమావేశ మందిరంలో వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బందికి జగనన్న సురక్షపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 23 నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా జగనన్న సురక్ష పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, జనన, మరణ, వివాహ, ఫ్యామిలీ, మ్యుటేషన్ లావాదేవీలకు సంబంధించిన, ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానం వంటి ధ్రువపత్రాల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని చెప్పారు. అర్హత కలిగిన ఏ ఒక్క కుటుంబంలో అయినా ప్రభుత్వ పథకం అందకపోయినా జల్లెడ పట్టి గుర్తించాలన్నారు. మండలం, మున్సిపాలిటీలోని అధికారుల కమిటీ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీపీఓ మూర్తి, ఇన్‌చార్జ్ మేనేజర్ పెంచలయ్య, ఏఈఈ కార్తికేయన్, టీపీఎస్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

- జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ బాలునాయక్



రామచంద్రాపురంలో బాల కార్మికుడిని గుర్తించిన కార్మిక శాఖ అధికారులు



వడమాలపేటలో తనిఖీలు నిర్వహిస్తున్న కార్మిక శాఖ అధికారులు

పుత్తూరు రూరల్: బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకునే వ్యాపార యాజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తిరుపతి జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.బాలునాయక్ హెచ్చరించారు. మంగళవారం బాల కార్మిక నిర్మూలన మాసోత్సవాల్లో భాగంగా పుత్తూరు న్యాయ సేవావిభాగం ఆధ్వర్యంలో కార్మిక శాఖ జిల్లా అధికారులు మండల కేంద్రాలైన వడమాలపేట, రామచంద్రాపురంలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా రామచంద్రాపురంలోని రాకేష్ ఎంటర్‌ప్రైజెస్‌లో పని చేస్తున్న బాల కార్మికుడు ప్రహ్లాద్(14)ను గుర్తించారు. ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యానికి జరిమానా విధించి, బాలున్ని పాఠశాలలకు పంపే ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ బీవీఎస్ కృష్ణారెడ్డి, పుత్తూరు, కార్వేటినగరం లేబర్ ఆఫీసర్లు కె.హేమాచారి, జి.రంగనాథ్, ఐసీపీఎస్ మెంబర్లు దేవయాని, కల్పన పాల్గొన్నారు.

వైఎస్సార్ పశుబీమాను సద్వినియోగం చేసుకోండి

శ్రీరంగరాజపురం : మండలంలోని పాడి రైతులు వైఎస్సార్ పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి శ్రీవిద్య అన్నారు. మంగళవారం ఆమె శెట్టివానత్తం రైతు భరోసా కేంద్రంలోని పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి రైతులు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకదారులకు ఊరట కలిగిస్తూ రాష్ట్రప్రభుత్వం నూతనంగా పశుబీమా పథకం ప్రవేశపెట్టడం జరిగింది. ఈ పథకంలో లబ్ధిదారుని వాటా ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీపీఎల్ లబ్ధిదారులకు 20 శాతంగా, ఏపీఎల్ లబ్ధిదారులకు 50 శాతంగా ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ పథకంలో గరిష్టంగా ఒక కుటుంబానికి 5 గేదెలకు, 50 గొర్రెలు, మేకలు, పందులకు బీమా చేసుకోవడానికి అవకాశం కలదన్నారు. వివరాలకు సమీపంలోని రైతు భరోసా కేంద్రం ద్వారా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమానికి వెటర్నరీ అసిస్టెంట్ హరిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మమ్మల్నీ క్రమబద్ధీకరించండి సార్..

- జేఏసీ నాయకుల విన్నపం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలతో వైఎస్సార్ విగ్రహం వద్ద జేఏసీ నాయకులు

పుత్తూరు రూరల్: ప్రభుత్వ కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని జేఏసీ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం వారు పుత్తూరులోని స్థానిక డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ మంచి నిర్ణయం తీసుకుందన్నారు. అయితే 2014 జూన్ 2వ తేదీ నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు మాత్రమే అర్హులన్న నిబంధన తమకు శాపంగా మారిందన్నారు. ఈ నిబంధనతో రాష్ట్రం మొత్తం మీద సుదీర్ఘ అనుభవం ఉన్న 2,100 మంది కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులరైజేషన్ కాలేకపోయారని వివరించారు. ఈ కొద్దిపాటి ఉద్యోగులను సైతం క్రమబద్ధీకరించాలని కోరారు. ‘మా నమ్మకం నువ్వే జగన్.. సీఎం జగనన్నా మీరే మాకు న్యాయం చేయాలి’ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు తంబయ్య, ప్రసాద్, జయప్రసాద్, రవి, హరి, రాజి, సుధా, నందిని, నదియా, ఉమారాణి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న అపోలో ఆస్పత్రి వైద్యబృందం

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఆవరణలో చిత్తూరు అపోలో ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించిందని ఎంఈఓ రాజేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ కంటి చూపు ప్రజలకు ఎంతో అవసరమని గుర్తించి అపోలో యాజమాన్యం ఉచితంగా కంటి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం డాక్టర్ శ్రీహిత మాట్లాడుతూ ఉచిత కంటి వైద్యశిబిరానికి సుమారు 130 మంది రోగులు రావడం జరిగిందన్నారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ అధునాతన పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అందులో కంటిచూపు కొరవడిన 15 మందిని ఎంపిక చేసి వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేసి కంటి అద్దాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఆస్పత్రిలో ఉన్నంతవరకు వారికి భోజన వసతి, బస్సు సౌకర్యం ఉచితంగా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగపవన్‌కళ్యాణ్, డాక్టర్ వేదమానస, డాక్టర్ అలీ, పాఠశాల హెచ్‌ఎం గంగాధరం, వార్డన్ రమాదేవి, అపోలో ఆస్పత్రి వైద్యసిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టండి



డీవైఈఓకు వినతపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలోని ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల యాజమాన్యాలు ఫీజుల పేరిట చేస్తున్న దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ సమితి సభ్యులు మంగళవారం డీవైఈఓ రఘురామయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు డి.మహేష్ మాట్లాడుతూ పాతబడిన పాఠశాల, కళాశాలల భవనాలకు సైతం బిల్డింగ్ ఫీజులను సైతం తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. తమ పాఠశాలల్లోనే విక్రయించే బుక్స్, యూనిఫాం, బెల్ట్, షూస్ వంటి వస్తువులను కొనుగోలు చేయాలని ఆంక్షలు పెడుతున్నారని ఆరోపించారు. ఫిట్‌నెస్ లేని వాహనాలను నడుపుతూ వ్యాన్ ఫీజులను అధిక మొత్తాలతో వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. అన్ని ప్రైవేటు పాఠశాలలపై తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన డీవైఈఓ రఘురామయ్య మాట్లాడుతూ తనిఖీలు నిర్వహించి, ఆరోపణలు వాస్తవాలైతే తప్పక చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సమితి నాయకులు అయ్యప్ప, సురేష్, విజయ్ పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి భూమిపూజ

శ్రీరంగరాజపురం: దేశంలోనే ఎంతో ప్రతిష్టాత్మకమైన డీఆర్‌డీఓ రక్షణసంస్థ మండలంలోని కొక్కిరల కోణకొండలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ డీఆర్‌డీఓ కేంద్రానికి చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి నుంచి డీఆర్‌డీఓ కేంద్రానికి జంగాలపల్లి గ్రామం మీదుగా రూ.5 కోట్లతో 1.2 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులు మంగళవారం భూమిపూజ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఓ కమాండర్ శర్మ, ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ రమణయ్య, ఏఈ కుమార్, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ ఉమామహేశ్వరి, తహసీల్దార్ లోకనాథపిళ్లై, జెడ్పీటీసీ మాజీసభ్యులు గురవారెడ్డి, మండల కన్వీనర్ మణి, నాయకులు అనంతరెడ్డి, జనార్ధన్, మునికృష్ణ, సుధాకర్ తంబి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.